

# తిరుమలలో తరగని రద్దీ

మెలికలు తిరిగిన క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు



సీఆర్వో వద్ద గుమిగూడిన భక్తులు

తిరుమలలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి ఆలయ పరిసరాలు, మాడవీధులు, బస్టాండ్, లేపాక్షి సర్కిల్, లడ్డూ కౌంటర్, పాపవినాశనం, శ్రీవారిపాదాలు వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మరోవైపు అలిపిరి, శ్రీవారిమెట్ల మార్గాల్లో భక్తులు అధిక సంఖ్యలో కొండకు తరలివస్తున్నారు. గదులకు డిమాండ్ కొనసాగుతుండటంతో భక్తులు కార్యాలయాల ముందు, షెడ్లు, చెట్లకింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారు. గదుల కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. కల్యాణకట్టల్లోనూ యాత్రికుల సందడి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నాదనీరాజనం ముందున్న షెడ్‌లో సేదతీరుతున్న యాత్రికులు

## టీటీడీ ఈవోగా శ్యామలరావు

# బాధ్యతల స్వీకరణ

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో(కార్యనిర్వహణాధికారి)గా శ్యామలరావు ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈవోగా నియమితులైన ఆయన తన సతీమణితో కలిసి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ తొలుత వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి నేరుగా వైకుంఠ క్యూకాంప్లెక్స్‌కు వెళ్లారు. క్యూలైన్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన రంగనాయ మండపంలో టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ధర్మారెడ్డి నుంచి బాధ్యతలను అందుకున్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరిగి రంగనాయకమండపానికి చేరుకున్న నూతన ఈవో దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత జేఈవో వీరబ్రహ్మం శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

### నీటిలో మట్టిలా కనిపిస్తోంది

క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఇచ్చే నీటిలో కొంచెం మట్టిలా కనిపిస్తోందని, దీనిపై పరిశీలన చేస్తామని ఈవో అన్నారు. క్యూలైన్ల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాలు అన్ని చోట్లా ఇవ్వడం లేదనే ఫిర్యాదులు క్యూలైన్లలోని భక్తుల నుంచి అందాయన్నారు. అధికారులతో సమీక్షించి.. పాలు, టీ పంపిణీపై కూడా దృష్టి సారిస్తామన్నారు. నడిచివచ్చే భక్తులకు టోకెన్లు ఇవ్వడం లేదని ఫిర్యాదులు కూడా వచ్చాయని, దీన్ని అధిగమిస్తామని చెప్పారు. ఇక, శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ క్యూలైన్లు భారీగా పెరిగిపోవడంపైనా పరిశీలన చేస్తామని తెలిపారు.



శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న శ్యామలరావు



భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న ఈవో

### అన్నప్రసాదాల తనిఖీ

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని ఈవో శ్యామలరావు తనిఖీ చేశారు. రాత్రి అన్నప్రసాద భవనానికి చేరుకున్న ఆయన అన్నప్రసాదాలు స్వీకరించారు. తర్వాత వంటశాల, స్టోర్ గదిని పరిశీలించారు. అలాగే భక్తుల క్యూలైన్, వారికి అన్నప్రసాదాలు అందే తీరున.. నాణ్యతను గమనించారు.



నూతన టీటీడీ ఈవోకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

### తొలిరోజే క్యూలైన్ల పరిశీలన

ఈవోగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే తిరుమలలో భక్తుల రద్దీ నెలకొన్న విషయాన్ని శ్యామలరావు తెలుసుకున్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, ఇతర అధికారులతో కలిసి రింగురోడ్డులో వ్యాపించి ఉన్న క్యూలైన్ వద్దకు వెళ్లారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు అందించే సదుపాయాలను పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. ఎక్కడినుంచి వచ్చారు, క్యూలైన్‌లో ఎంత సేపటినుంచి ఉన్నారు.. అన్నప్రసాదాలు, తాగునీరు అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. అన్నప్రసాదాలు, తాగునీటి నాణ్యతను గమనించారు. అలాగే నారాయణగిరి షెడ్లను కూడా పరిశీలించి.. సర్వదర్శన భక్తులతో మాట్లాడారు.

# తోతాపురి టన్నుకు రూ.30వేలివ్వండి

- సీఎం చొరవతో పల్ప్ ఫ్యాక్టరీలకు కలెక్టర్ల ఆదేశాలు
- ధరల పతనంపై చంద్రబాబు దృష్టికి చంద్రగిరి ఎమ్మెల్యే తీసుకెళ్లడంతో కదలిక
- తీరనున్న మామిడి రైతుల వెతలు



తిరుపతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల వెతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి ధరల పతనంపై రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఆయన వెంటనే సీఎం చంద్రబాబుకు తెలియజేశారు. సీఎం చొరవతో కలెక్టర్లలో కదలిక వచ్చింది. తోతాపురి టన్నుకు రూ.30వేల చొప్పున రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు చెల్లించాలంటూ చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు షన్మోహన్, ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఆదేశాలిచ్చారు. అంతకన్నా తక్కువ చెల్లిస్తే కఠిన చర్యలు ఉంటాయనీ హెచ్చరించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.87 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. చిత్తూరు జిల్లా పరిధిలో 1.50 లక్షల ఎకరాలు, తిరుపతి జిల్లా పరిధిలో 1.37 లక్షల ఎకరాలు చొప్పున వుంది. ఉమ్మడి జిల్లాలో సాగయ్యే మామిడి పంటలో 90 శాతం తోతాపురి రకం కాగా.. మిగిలిన పది శాతం టేబుల్ వెరైటీలుగా పేర్కొనే బేనీషా, మల్‌గూబా తదితర రకాలున్నాయి. టేబుల్ వెరైటీలకు ఏటా మంచి ధరే పలుకుతుండగా 90 శాతం సాగయ్యే తోతాపురి మాత్రం దిగుబడి యావత్తూ జిల్లాలోని 30 పల్ప్ ఫ్యాక్టరీలపై ఆధారపడి ధరలు పలుకుతుంటాయి. సాధారణ స్థితిలో ఎకరాకు 8-10 టన్నుల దిగుబడి రావాలి. అయితే ఈసారి ప్రతికూల పరిస్థితులతో దిగుబడి తగ్గింది. అకాల వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి నేలరాలింది. అందువల్ల ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు ఒకటి నుంచి రెండు టన్నుల్లోపే దిగుబడి వచ్చింది. దామలచెరువు, చిత్తూరు, బంగారుపాళెం, తిరుపతిలో మండీలతో కూడిన మార్కెట్లు వుండగా.. వ్యాపారులు అధికారికంగా దిగుబడి కొనుగోలు చేసే ర్యాంపులు 30 దాకా వున్నాయి. వీటిలో టన్నుకు రూ.19వేల నుంచి 21వేల వరకూ ధర పలుకుతుండగా.. ఒక్క జైన్ పల్ప్ ఫ్యాక్టరీ మాత్రం రూ.23వేల చొప్పున చెల్లిస్తోంది. అసలే దిగుబడి తగ్గిపోయి ఆదాయం కోల్పోతున్న రైతులు వచ్చిన కొద్దిపాటి దిగుబడికి కూడా తగిన ధర పలకక పోవడంతో తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. టన్నుకు రూ.30వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, వ్యాపారులు స్పందించకపోవడంతో మామిడి రైతులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని ఆశ్రయించారు. ధరల పతనంపై మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన మామిడి రైతుల గోడు నేరుగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చొరవతో రెండు జిల్లాల కలెక్టర్లూ రంగంలోకి దిగారు. తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.30వేల చొప్పున ధర చెల్లించాలని పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను ఆదేశించారు.

### మద్దతు ధర చెల్లించకుంటే ఫ్యాక్టరీల ఎదుట ఆందోళన

- పులివర్తి నాని -

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సైతం పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలకు అల్టిమేటమ్ జారీ చేశారు. టన్నుకు రూ.30వేల చొప్పున ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించని పక్షంలో ఫ్యాక్టరీల ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు 5,449 మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16: జిల్లాలో ఆదివారం జరిగిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరిగింది. తిరుపతిలోని 11 పరీక్షా కేంద్రాల్లో 5,518మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 5,449మంది హాజరయ్యారు. ఉదయం 2,728మంది (49.44శాతం), మధ్యాహ్నం 2,721మంది (49.31 శాతం)గా హాజరయ్యారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్,డీఆర్వో తెలిపారు.





## కాలినడకన తిరుమలకు మంత్రి సత్యకుమార్



అలిపిరి వద్ద ఆరణి, బీజేపీ నాయకులతో సత్యకుమార్

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కాలినడకన ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన సాయంత్రం అలిపిరికి చేరుకున్నారు. మంత్రికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. అక్కడినుంచి బయలుదేరిన మంత్రి రాత్రి 10 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## అలరించిన చిన్నారుల నృత్యం



తిరుచానూరు, జూన్ 16: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. కర్ణాటక, చిత్తూరుజిల్లా బైరెడ్డిపల్లికి కళాతరంగిణికి చెందిన కళాకారులు రాజేష్, మస్తాన్, లహరి, భరత్, మధుశ్రీ, భవారి, తేజశ్రీ, రితిక, మహాలక్ష్మి తదితరులు మహాగణపతి మనసాస్మరామి, వేయి నామాల వాడ వెంకటేశుడా, నీలి నీలి కళ్లవాడే వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

## మాతంగి వేషంలో మిట్టమీద గంగమ్మ దర్శనం



మాతంగి వేషధారణలో భక్తులు

చంద్రగిరి, జూన్ 16: చంద్రగిరిలో మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మాతంగి వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, మాతంగి వేషధారణగా అలంకరించి దర్శనం కల్పించారు. భక్తులు కూడా ఇదే వేషధారణలో అమ్మవారిని దర్శించుకుని, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరిగింది. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## కోళ్లఫారాల వద్ద అక్రమ నిర్మాణం



మంగళం, జూన్ 16: మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీలో కోళ్లఫారాల వద్ద సర్వే నెంబరు 195లో ఆదివారం అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిపై సంబంధిత వీఆర్వో భూపతి ఆచారిని వివరణ కోరగా అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి కూల్చివేస్తామన్నారు. శనివారమే అక్రమ నిర్మాణాన్ని ఆపాలని వీఆర్వో సూచించినట్లు తెలుస్తోంది. అయినా పనులు కొనసాగిస్తుండటం గమనార్హం.

## అగ్ని ప్రమాదంలో పందిరి దగ్ధం



మంగళం, జూన్ 16: మంగళం పరిధిలోని చెన్నాయిగుంట తెలుగుగంగ పంపు హౌస్ ఎదురుగా ఉన్న టీ దుకాణం ముందు పందిరికి మంటలంటుకున్నాయి. శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి దుకాణం ముందు పందిరి వేశారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో దీనికి మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే పందిరి పూర్తిగా కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు టీ దుకాణానికి నిప్పు పెట్టారా లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయా అన్న విషయం తేలాల్సి ఉంది.

## ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఆరోగ్యనాథన్ మృతి

రేణిగుంట, జూన్ 16: రేణిగుంట అన్నాయినగర్‌కు చెందిన చెందిని జాతీయ జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకా రుడు ఆరోగ్యనాథన్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచు జ్యోతి నారాయణ, కార్యకర్తలు అమర్‌నాథ్‌రెడ్డి, విద్యాసాగర్ నివాళులర్పించారు.

# నేపాల్‌లో పట్టుబడ్డ 173 టన్నుల ఎర్రచందనం

- తిరుపతికి తీసుకొచ్చేందుకు సిద్ధమైన అటవీశాఖ అధికారులు
- ఇతర దేశాల నుంచి ఇలా తీసుకురావడం ఇదే తొలిసారి

మంగళం, జూన్ 16: అత్యంత విలువైన ఎర్రచందనాన్ని వివిధ మార్గాల్లో దేశం సరిహద్దులు దాటిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లు తాజాగా నేపాల్‌లో ఊహించని విధంగా అక్కడి అధికారులకు దుంగలతో పట్టుబడ్డారు. దాదాపు 173 టన్నుల ఎర్రచందనం దుంగలను ఆదేశంలోని అధికారులు పట్టుకున్నారు. అయితే అది ఎర్రచందనం అనేది వారికి తెలియదు. సాధారణంగా కలపను తరలించే సమయంలో అందుకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అనుమతులు లేకుండా తరలిస్తున్న ఈ ఎర్రచందనం దుంగలను సాధారణ కలపగా భావించి వారు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత విచారణలో ఇది కోట్ల రూపాయల విలువ చేసే ఎర్రచదనం దుంగలుగా గుర్తించారు. మనదేశంతో నేపాల్‌కు ఉన్న సత్సంబంధాల కారణంగా దీనిపై భారత ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించారు. దీనిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎర్రచందనం నిర్ధారణకు నేపాల్ వెళ్లేందుకు ఏపీ ప్రొడక్షన్ పీసీసీఎఫ్ ఖజూరియాకు ఆదేశాలిచ్చారు. నేపాల్‌కు వెళ్లిన ఆయన అక్కడి అధికారులు స్వాధీనం చేసుకుంది ఎర్రచందనం అని నిర్ధారించారు. దీంతో మేనెల నుంచి 90 రోజుల్లో నేపాల్‌లో పట్టుబడ్డ ఎర్రచందనాన్ని భారత్‌కు తీసుకురావడానికి మన ప్రభుత్వం అనుమతులు కూడా ఇచ్చింది.

### అధికారులు నేపాల్ వెళ్లడానికి ఏర్పాట్లు పూర్తి

ఈనెల 20వ తేదీన తొమ్మిది మంది ఏపీ అటవీశాఖ అధికారుల బృందం నేపాల్‌కు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ బృందంలో పీసీసీఎఫ్ ఖజూరియా, విజయనగరం జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్, ఎఫ్‌డీవో అప్పిరెడ్డి, తిరుపతికి చెందిన సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో శివకుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో లక్ష్మీపతి, ఎఫ్ఎస్‌వోలు చైతన్య, రమేష్, ఎఫ్‌బీవోలు వేణుగోపాల్, వర్ధన్‌కుమార్‌లున్నారు. ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు ఈ బృందం నేపాల్‌లో ఉన్న 173 టన్నుల ఎర్రచందనాన్ని తిరుపతిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద ఉన్న సెంట్రల్ గోడౌన్‌కు తీసుకొచ్చి భద్రపరచనున్నారు. ఇతరదేశాల్లో పట్టుబడ్డ ఎర్రచందనాన్ని మన దేశానికి తరలించడం ఇదే తొలిసారి.



డ్రైవర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీస్తున్న పోలీసులు

## రెండు లారీలు ఢీకొని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

చంద్రగిరి, జూన్ 16: చంద్రగిరి సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో రెండు లారీలు ఢీకొన్నాయి. ఓ లారీలోని డ్రైవర్ అయితే క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం చిత్తూరు నుంచి రేణిగుంటకు వెళ్తున్న లారీని, ధర్మవరం నుంచి తిరుపతికి టైల్స్ లోడ్డుతో వస్తున్న లారీ ఢీకొంది. ముందు లారీ రోడ్డు పక్కకు దూసుకెళ్లి కాలువలో ఇరుక్కుపోయింది. వెనుక లారీ క్యాబిన్ నుజ్జు నుజ్జయింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు వచ్చి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ కుమార్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ధర్మవరానికి చెందినవాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ కుమార్

## వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలు



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి ఆదివారం సుమారు మూడు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు స్వామి దర్శనార్థం విచ్చేయడంతో క్యూలన్నీ పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- ఐరాల(కాణిపాకం)

## బావిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



గుణశేఖర్ మృతదేహం

పెనుమూరు, జూన్ 16: బావిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సన్యాసిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి స్నేహితులు, పోలీసుల కథనం మేరకు.. సన్యాసిపల్లికి చెందిన గుణశేఖర్(45) చిత్తూరు ఆర్టీసీ డిపో-2లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి తమ వ్యవసాయ బావి వద్ద మద్యం తాగారు. స్నేహితులతో మాట్లాడుతుండగానే బావిలో దూకేశాడు. ఇద్దరు స్నేహితుల్లో ఒకరికి ఈత రాకపోవడం, మరొకరు బావిలో దూకి ఎంత ప్రయత్నించినా గుణశేఖర్ కనిపించలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి అతని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. కాగా, మృతుడి భార్య 2019లో ఆత్మహత్య చేసుకుంది. పిల్లలు లేరు. బతుకు మీద విరక్తి కలుగుతోందని అప్పుడప్పుడూ గుణశేఖర్ చెబుతుండేవాడని స్నేహితులు పేర్కొన్నారు.

## లారీ, ద్విచక్ర వాహనం ఢీ

### జడ్చర్ల యువకుడి మృతి ఇద్దరికి తీవ్ర గాయాలు

రేణిగుంట, జూన్ 16: ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్న ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామండూరు వద్ద ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం జడ్చర్లకు చెందిన యాదగిరి, మహేష్, అరుణ్‌కుమార్ జీవకోన సమీపంలో రెడ్డిభవనం వద్ద ఒప్పంద కార్మికులుగా పని చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ముగ్గురూ ఒకే ద్విచక్ర వాహనంలో మామండూరు అటవీ ప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యాదగిరి(32) అక్కడికక్కడే మృతి చెందగా, మహేష్, అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



మేదినీ పూజ అనంతరం పుట్టమట్టిని సేకరిస్తున్న అర్చకులు



విద్యుత్‌దీపాలంకరణలో ఆలయం

వడమాలపేట, జూన్ 16: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. మాడవీధుల్లో మేళతాళాలతో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. పుట్టమట్టిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టిని మేదినీ దేవి రూపంలో అలంకరింపజేసి, మంగళహారుతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ధ్వజారోహణం

అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు సోమవారం మిథున లగ్నంలో ఉదయం 6.55 - 7.25 గంటల మధ్య ధ్వజారోహణం చేయనున్నారు.

### ముస్తాబైన అప్పలాయగుంట

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అప్పలాయగుంట సుందరంగా ముస్తాబైంది. ఈనెల 17నుంచి 25వ తేదీ వరకు ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ప్రత్యేక విద్యుత్‌దీపాలు, దేవతామూర్తుల కటౌట్‌లతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మాడవీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

## సూళ్లూరుపేటలో ఉరుములు, మెరుపులతో వర్షం



జీఎన్‌టీరోడ్డులో, గాండ్లవీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన నీరు

సూళ్లూరుపేట, జూన్ 16: పట్టణంలోని ఆదివారం మధ్యాహ్నం ఉన్న ట్టుండి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది.ఉదయం భానుడు భగభగమన్నాడు. మధ్నాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘా వృ తమై ఉరుములు, మెరుపులు, గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జీఎన్ఈటీ రోడ్డు,షార్ బస్టాండు, గాండ్లవీధి జలమయంగా మారాయి. గంటపాటు కురిసిన భారీ వర్షానికి జీఎన్‌టీ రోడ్డులో నీరు నిలబడడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బంది పడ్డారు. గాండ్ల వీధి లోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మోకాటి లోతు నీరు నిలబడడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి. కూరగాయల మార్కెట్ సెంటర్ రోడ్డు లో నీరు నిలబడడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వర్షపు నీటితో పాటూ మురుగు పొంగి ప్రవహించింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన పట్టణవాసులు ఈ వర్షంతో సేద దీరారు.

# గంజాయి విక్రయాలకు బ్రేక్ పడేనా?



బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద చెన్నైకి వెళ్లే ఆర్టీసీ బస్సులో స్వాధీనం చేసుకున్న గంజాయితో సెబ్ అధికారులు(ఫైల్‌ఫొటో)

తడ, జూన్ 16: సూళ్లూరుపేట... రాష్ట్ర సరిహద్దుల్లో చిట్టచివరి నియోజక వర్గం... ప్రశాంతంగా ఘర్షణలకు తావులేకుండా ఉన్న నియోజకవర్గం... అది ఒకప్పటి మాట. ప్రస్తుతం అరాచకం, దౌర్జన్యాలతోపాటు గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అందుకు పార్టీల నాయకులే కాకుండా పోలీసులు వత్తాసుపలకడంతో ఇక్కడ శాంతిభద్రతలు అట కెక్కాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 2014వ సంవత్సరానికి ముందు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు పెద్దగా జరిగేవికావు. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో అప్పటి నుంచే నియోజకవర్గంలో మార్పు రావడం మొదలైంది. దాంతోపాటు గంజాయి అమ్మకాలు మొదలయ్యాయి.

### లోకల్ రైళ్లలో తరలింపు...

అప్పట్లో తమిళనాడు రాష్ట్రంలోని ఎలాఊరు, గుమ్మిడిపూండి, కవర పేటలకు చెందిన కొందరు గంజాయిని లోకల్ రైళ్లల్లో తడ, అక్కంపేట, సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి జారుకునేవారు. ఈ క్రమంలో 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొందరు ఈ నియోజకవర్గంలో దుకాణాలు తెరిచేశారు. విశాఖపట్టణం, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి నేరుగా గంజాయిని తీసుకువచ్చి కొన్ని ప్రాంతాల్లో డంప్ చేసుకొని విచ్చలవిడిగా విక్రయించారు.

### పోలీసుల అండదండలు...

ఇలా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారు. కొందరికి వాటిలో వాటాలు ఉన్నట్లు గుసగుసలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సుదీర్ఘకాలం పోలీస్ అధికారిగా పనిచేసిన ఒక అధికారి ఈ గంజాయి విక్రయాలకు వెన్నుదన్నుగా నిలవడంతో మరింత జోరందుకున్నాయి. నెల మామూళ్లు, సెటిల్‌మెంట్ల కోసం కొన్ని కేసులను నమోదు చేసి చేతులను దులుపుకొని వాటి ద్వారా లక్షల రూపాయల మామూళ్లు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి.

### నామమాత్రంగా కేసులు

వాస్తవంగా 2022-23 సంవత్సరంలో తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టులో ఎస్ఈబీ అధికారుల తనిఖీల్లో వివిధ కేసుల ద్వారా ఆ ఏడాది సుమారు 100 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో సదరు అధికారి వాటిపై దృష్టిపెట్టి నామమాత్రంగా కొన్ని కేసులు నమోదుచేసి వారి నుంచి నెల మామూళ్లను వసూళ్లు చేసినట్లుగా విమర్శలు వినిపించాయి. ఆ తరువాత భీములవారి చెక్‌పోస్టు వద్ద ఇటు పోలీసులు అటు సెబ్ అధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. అందుకు ఆ గంజాయి విక్రయాల్లో వైసీపీకి కూడా వాటా ఉన్నట్లుగా తెలుస్తోంది. తద్వారా ఈ అమ్మకాలు జోరందుకున్నట్లుగా నియోజక వర్గంలో టాక్ నడుస్తోంది.

### నిరుపయోగం... కార్డన్ సెర్చ్!

ఈ క్రమంలో పోలింగ్ పూర్తి అయిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా వివిధ చోట్ల అల్లర్లు చెలరేగడంతో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సూళ్లూరుపేటలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గంజాయి విక్రయదారులకు సమాచారం అందడంతో సిబ్బంది వచ్చేలోగా తరలించేసినట్లుగా గుస గుసలు ఉన్నాయి. అయినా ఓ మహిళ ఇంట్లో సుమారు 2.5 కిలో గంజా యి గుర్తించి దానిపై నామమాత్రంగా కేసు నమోదు చేసినట్లుగా తెలు స్తోంది. ఇలా వైసీపీ వర్గాలు పోలీసుల సహకారంతో సూళ్లూరుపేట నియో జకవర్గంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వమైనా గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టి శాంతి భద్రతలను పరి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# 23 ఏళ్ల తర్వాత 'కారుణ్యం'!

**పెద్దిరెడ్డి చెప్పారని డీసీసీబీలో నిబంధనల విరుద్ధంగా పోస్టింగ్ ● ఆలస్యంగా వెలుగు చూసిన వ్యవహారం**

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 16: వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలన గాడితప్పింది. పాలకవర్గానికి చేస్తున్న తప్పులు ఎత్తిచూపాల్సిన అధికారులు వారి మెప్పుకోసం వత్తాసు పలికారు. ఆ అంశాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారంటూ 23ఏళ్ల తర్వాత ఓ ఉద్యోగి కుమారుడికి జీవో నెం. 1005 కింద కారుణ్య ఉద్యోగం ఇచ్చినట్లు తెలిసింది. నాలుగేళ్ల కిందట జరిగిన ఈ విషయం తాజాగా వెలుగు చూసింది. డీసీసీబీ పుంగనూరు బ్రాంచ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసిన డి.జయరామ్ 1997 అక్టోబరు 6న మృతిచెందారు. కారుణ్య నియామకాల కింద మృతుడి కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి ఏడాది కాలపరిమితిలో దరఖాస్తుల ఆధారంగా ఉద్యోగం ఇవ్వవచ్చు. ఇది నిబంధన. అప్పట్లో కుటుంబ సభ్యులు చేసుకున్న దరఖాస్తును బ్యాంకు అధికారులు అనర్హుడంటూ పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా మృతుడి కుమారుడు డి.జయప్రకాష్ ఇటీవలి పెద్దిరెడ్డివర్గానికి దగ్గరయ్యాడు. దాంతో మంత్రి పెద్దిరెడ్డి నోటిమాటతో.. నిబంధనలకు విరుద్ధంగా కుప్పం బ్యాంక్ బ్రాంచ్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా 2020 మే4వ తేది ఉద్యోగం ఇచ్చారు. తొలుత అనర్హుడని పోస్టింగ్ ఇవ్వని అధికారులు, 23 ఏళ తర్వాత ఆ వ్యక్తి అర్హుడంటూ పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఆ మేర బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేసి రహస్యంగా ఆమోదం తెలిపింది. ఈ వ్యవహారంపై కలెక్టర్ షన్మోహన్ విచారణ కమిటీ వేసి నిజాలు నిగ్గుతేల్చాలని టీడీపీకి అనుబంధమైన ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత ఐదేళ్లలో బ్యాంకులో జరిగిన అవకతవకలు, ఇష్టారాజ్యంగా రుణాల వితరణ వంటి అంశాలను బయటకు తీసేపనిలో టీడీపీ నాయకులు నిమగ్నమైనట్లు తెలిసింది.

# ఆలయంలోకి దళితుల నిషేధం

- పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు అగ్ర కులస్తుల దాడి
- కుప్పంలో ఉద్రిక్తం

కుప్పం, జూన్ 16: నాగరిక సమాజంలో ఇంకా దళితులపై నిషేధాలు, దాడులు కొనసాగుతున్నాయి. జాతర సందర్భంగా ఆలయంలోకి ప్రవేశించబోయిన దళితులను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. కుప్పం పురపాలక సంఘం బండశెట్టిపల్లెలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్తతను సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బండశెట్టిపల్లెలో ఈ నెల 11వ తేదీన జాతర జరిగింది. అదే గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు పూజ చేసుకోవడానికి ఆలయం వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న అగ్ర కులస్తులు కొందరు వారిని అడ్డుకున్నారు. తమతో సమానంగా దళితులకు ఆలయంలోకి ప్రవేశం లేదని, బయటే పూజలు చేసుకొమ్మని ఆదేశించారు. దీనిపై గ్రామంలో చాలా సార్లు పంచాయితీలు జరిగాయి. గ్రామంలోని ఏ ఆలయానికీ దళితులకు ప్రవేశం లేదంటూ అగ్రకులాలు తీర్మానం చేశారు. దీంతో మొత్తం ఘటనపై దళితులు కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన అగ్ర కులానికి చెందిన మునీంద్ర అనే యువకుడు, ఆదివారం రాజవేలు అనే దళిత యువకుడిపై దాడిచేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అర్బన్ ఎస్ఐ సుబ్బారెడ్డిని వివరణ కోరగా, దళితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సంఘటనపై విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



గాయపడిన రాజవేలు

## చికెన్ కోసం వెళ్లి...ఆస్పత్రి పాలు

మదనపల్లె టౌన్, జూన్ 16: ఆదివారం చికెన్ తిందామని, దుకాణానికి వెళ్లి చికెన్ కొనుగోలు చేసిన వ్యక్తి రోడ్డుప్రమాదంలో బాధితుడై ఆస్పత్రి పాలయ్యాడు. ఆదివారం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన రైతు నారాయణ రెడ్డి(62) చికెన్ కొనేందుకు మదనపల్లె మండలంలోని మొలకలదిన్నె క్రాస్‌కు వచ్చాడు. చికెన్ తీసుకుని రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి నారాయణరెడ్డిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డిని మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించి చికిత్స చేయించగా అతని పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

## పెరుగుతున్న టమోటా ధరలు

- ములకలచెరువులో 22 కేజీల బాక్సు రూ.1200

ములకలచెరువు, జూన్ 16: ములకలచెరువు మార్కెట్‌లో టమోటా ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఆదివారం మార్కెట్‌లో 22 కేజీల బాక్సు అత్యధికంగా రూ.1200 పలికింది. వేసవిలో ఎండ తీవ్రత టమోటా సాగుపై పడింది. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి శాతం భారీగా తగ్గిపోయి భూగర్భజలాలు తగ్గిపోవడంతో టమోటా సాగు భారీగా తగ్గింది. దిగుబడి భారీగా తగ్గడంతో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. 20 రోజులుగా టమోటా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. రెండు రోజుల క్రితం వరకు రూ.600 నుంచి రూ.వెయ్యి పలికిన బాక్సు ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. తాజాగా ఆదివారం నాణ్యతను బట్టి రూ.800 నుంచి రూ.1200 వరకు పలికింది. కిలో రూ.36 నుంచి రూ.54 వరకు పలికాయి. ఇక్కడి నుంచి టమోటాలు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు పట్టణాలకు ఎగుమతి అవుతున్నాయి. కాగా బయటి మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.80కు చేరింది.



## రాక్షసపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి

### ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాక్షసపాలన నుంచి రాష్ట్రం విముక్తి అయిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఏపీకి శుభసూచికమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములం కావడడం ద్వారా వందకు వంద శాతం పోలవరం, అమరావతి, జాతీయ రహదారులతోపాటు జాతీయ ప్రాజెక్టులు సాధించుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఎన్డీయే కూటమి రానున్న ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తును మార్చేస్తుందనేందుకు నిదర్శనంగా సీఎంగా ప్రమాణస్వీకారం చేశాక చంద్రబాబు ఐదు సంతకాలు చేశారన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటా

### ఎమ్మెల్యే మురళీమోహన్


మురళీమోహన్‌ను సత్కరిస్తున్న జర్నలిస్టులు

తిరుపతి అర్బన్, జూన్ 16: తన ఎదుగుదలకు సహాయపడిన జర్నలిస్టులకు అండగా ఉంటానని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె.మురళీమోహన్ అన్నారు. ఆయన్ను ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజావాణితోపాటు జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించే అవకాశం దక్కిందన్నారు. ప్రెస్‌క్లబ్‌కు సొంతస్థలం, జర్నలిస్టుల ఇళ్లస్థలాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మురళి మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్టులు ఉమామహేశ్వరరావు, దేవరాజన్, రవికుమార్, రామచంద్రారెడ్డి, నగేష్, సుధీర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్ ప్రసంగించగా, రమేష్, దినేష్, సునీల్, మహేష్, పరందామరెడ్డి, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జూన్ 16: నిత్యం యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ పార్కులో పతంజలి యోగాసమితి, భారతి స్వాభిమాన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగా గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ముదావహమన్నారు. పతంజలి యోగా సమాజం ప్రతినిధి కైలాస్‌సింగ్ రాజ్‌పురోహిత్, జగన్నాథం, ఓటేరు కృష్ణ, యోగా గురువులు ప్రభాకర్, తంగరాజ్, రాధిక, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ శుభాకాంక్షలు : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16: జిల్లాలోని ముస్లింలందరూ మతసామరస్యం వెల్లివిరిసేలా సంతోషంగా బక్రీద్ జరుపుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచల కిషోర్ తదితరులు ఆకాంక్షించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

## రైల్వే లైజన్ ఇన్‌స్పెక్టర్‌గా సుదర్శన్ రాజు



తిరుపతి(సెంట్రల్), జూన్16: తిరుపతి రైల్వే లైజన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సుదర్శన్ రాజు తిరుమలకు బదిలీ అయ్యారు. ఆయన తిరుమలలో బాధ్యతలు చేపట్టారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ విభాగం పర్యవేక్షకుడిగా పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కొత్త విధులను సక్రమంగా నిర్వహిస్తామని సుదర్శన్ రాజు తెలిపారు.

## తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి




తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత శుక్రవారం అలిపిరి మెట్ల మార్గంలో పడి ఉన్న ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తిరుమల టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ సమీపంలోని అలిపిరి మెట్లమార్గంలో సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి ఎలాంటి కదలికలు లేకుండా పడి ఉన్నాడు. పోలీసులు అతడ్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అదే రోజు స్విమ్స్ ఆస్పత్రికి పంపారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతునివద్ద ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.వివరాలు తెలిసిన వారు 0877-2263733 నెంబరుకు తెలియజేయాలని తిరుమల టూటౌన్ పోలీసులు కోరారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 16: ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ అమరావతి జేఏసీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఈయూ జిల్లా కార్యదర్శి తాండాయం సత్యనారాయణ ఓ ప్రకటనలో కోరారు. ఉద్యోగులతోపాటు కార్మికులు, ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, బకాయిలు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు, ఇతర నియామకాలు చేపట్టాలన్నారు. బస్సులు కొనుగోలుచేసి ఆర్టీసీని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సీపీఎస్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం



తిరుపతి అర్బన్, జూన్ 16: రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వంకీపురం పవన్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా మురళీమోహన్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా ధరణికుమార్, కోశాధికారులుగా హేమంత్, గుంటూరు రేఖ, రాష్ట్ర కౌన్సిలర్లు చీర్ల కిరణ్, భరత్‌కుమార్, గంటా భరత్, సుబ్బారాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, చలపతి, సునీల్ కుమార్ యాదవ్, రంగయ్య, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, శ్రీహరి, ఈశ్వర్‌నాయక్ నియమితులయ్యారు.

## భక్తులతో కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం




సూళ్లూరుపేట, జూన్ 16: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం తెలుగు, తమిళ భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి పొం గళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌లో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.09 కోట్లు

తిరుమల, జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.09 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 82,886 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 44,234 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

## భోగ శ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన రోజు సందర్భంగా భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని, భోగశ్రీనివాసమూర్తిని, శ్రీవిష్వక్సేనులవారిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో మనవాళపెరుమాళ్(భోగ శ్రీనివాసమూర్తి)ను, ఆయనకు అభిముఖంగా విష్వక్సేనుల వారిని ఉంచారు. తర్వాత మూలమూర్తిని భోగ శ్రీనివాస మూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేశారు. అంటే భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించనట్టు అవుతుంది. అనంతరం వేదపండితులు వేదపారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్ర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆర్జితసేవలన్నీ యదావిధిగా నిర్వహించారు. ఏకాంతంగా జరిగిన ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్లు శ్రీహరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మఠం భూమిపై మళ్లీ వివాదం

### పట్టించుకోని అధికారులు


దుకాణాల ముందు భాగాన్ని తవ్వేసిన దృశ్యం

తిరుపతి (జీవకోన), జూన్ 16: నగరంలో అత్యంత విలువైన హథీరాంజీ మఠం భూమిని చేజిక్కించుకోవడానికి రెండు వర్గాల మధ్య వర్గపోరు నడుస్తోంది. ఇందులో ఆ భూమిలో నిర్మించిన దుకాణాల ముందు భాగాన్ని మరో వర్గం వారు ఆదివారం తొలగించేందుకు ప్రయత్నించారు. వివరాలిలా.. నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం లెక్క దాఖల సర్వే నంబరు 81/1లో హథీరాంజీ మఠానికి 1.44 ఎకరాల భూమి ఉంది. దీనిని కొన్నేళ్ల క్రితం ఎం.చెంగారెడ్డి అనే రైతుకు లీజు పద్ధతిపై వ్యవసాయం కోసం మఠం కేటాయించింది. అయితే ఈ భూమిని సాగు చేస్తున్న తనకు కేటాయించి యజమాన్య హక్కులు కల్పించాలని ఆ వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. లీజు సమయం పూర్తయినా భూమి అప్పగించలేదంటూ ఎండోమెంట్ చట్ట ప్రకారం సాగుదారును ఆక్రమణదారుగా మఠం అధికారులు ప్రకటించారు. ఈ తతంగమంతా కోర్టులో నడుస్తుండగానే ఏడాదిన్నర క్రితం ఓ వర్గంవారు మఠం భూమిలో దుకాణాలు నిర్మించారు. వైసీపీ నాయకుల అండతో నిర్మించడంతో అధికారులు పట్టించుకోలేదు. తాజాగా అవతలివర్గం వారు ఈ భూమి తమకే చెందుతుందని, సర్వహక్కులు ఉన్నాయంటూ దుకాణాల నిర్మాణానికి అడ్డు చెప్పారు. ఆదివారం వీరు దుకాణాల ముందుభాగాన్ని ధ్వంసం చేశారు.

**లబోదిబోమంటున్న దుకాణదారులు**

దుకాణాల్లో చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్న వారంతా ఈ సంఘటనతో లబోదిబోమంటున్నారు. బతుకుదెరువు కోసం లక్షల రూపాయలు అప్పు చేసి దుకాణాలు నిర్వహించుకుంటున్నామని, తమకు కొంత సమయం ఇవ్వాలని చెప్పడంతో నిర్మాణాల తొలగింపు ఆపినట్లు తెలుస్తోంది. ఈ భూమిని చేజిక్కించుకోవడానికి ఇరువర్గాలూ చేస్తున్న ప్రయత్నాలపై మఠం అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి స్వాగతం


సత్యకుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 16: నగరానికి ఆదివారం వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గరుడ సర్కిల్ వద్ద పార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, అజయ్‌కుమార్, మల్లకుప్పం శేఖర్, జయంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలిపిరి వద్ద అఖిలభారత యాదవ మహాసభ సంఘం ప్రధాన కార్యదర్శి, టీడీపీ యువనేత శంకర్‌యాదవ్ స్వాగతం పలికి సన్మానించారు. హరి, సాయి, శీను, నవీన్, ఈశ్వర్, అనిల్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రిని ఆదివారం విజయవాడ కార్యాలయంలో సామంచి శ్రీనివాస్ కలిసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

**తిరుపతి(వైద్యం):** మంత్రికి తిరుపతి విమానాశ్రయంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, ఐఎంఏ నేతలు దగ్గుమాటి శ్రీహరిరావు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికారు.

## విద్యుత్ సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్ఈగా సురేంద్ర నాయుడు



సురేంద్ర నాయుడికి అభినందనలు తెలుపుతున్న ఈఈలు, డీఈఈలు, ఏఈలు

తిరుపతి(ఆటోనగర్), జూన్16: సదరన్ డిస్కం తిరుపతి విద్యుత్ సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా) ఇన్‌చార్జ్ ఎస్ఈగా పాలడుగు సురేంద్రనాయుడు ఆదివారం అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఆయన సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం జీఎంగా ఉన్నారు. ఈయన 1990లో నగరిలో ఏఈగా విధుల్లో చేరారు. అంచెలంచెలుగా పదోన్నతులు పొంది జీఎంగా బాధ్యతలు చేపట్టారు. సురేంద్రనాయుడికి సర్కిల్ పరిధిలోని ఈఈలు ఎస్.దామోదరం, కె.శ్రీనివాసులు, కె.వాసుదేవరెడ్డి, ఎన్.వాసురెడ్డి, చిన్నరెడ్డెప్ప, డీఈఈలు ప్రభాకర్, బాబు, బాలాజీ, మునిప్రసాద్, ఆంజనేయులు, ప్రసన్నలతోపాటు ఏఈలు టి.మోహన్, నీలకంఠం, శ్రీనివాసులునాయుడు, మునిరామ్, ఎల్.చలపతి, రవిచంద్రబాబు, గణపతి, శ్రీనివాసరాజు, నాగరాజు, హరిప్రసాద్‌రెడ్డి, వెంకటరమణ, హేమచంద్రారెడ్డి, మోహన్, రాము, చంద్రమౌళి, వేణుగోపాల్‌రాజు, హరితలతోపాటు అధికారులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

**నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి**

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని సురేంద్ర నాయుడు ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అన్ని సెక్షన్లలో సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిలయితే వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ఘనంగా శతాధిక కవి సమ్మేళనం


ఉషారాణికి సత్కారం

తిరుపతి (కల్చరల్), జూన్ 16: శ్రీశ్రీ కళావేదిక, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్టూడెంట్స్ వెల్ఫేర్, కల్చరల్ విభాగం సంయుక్తంగా తిరుపతిలోని వర్సిటీ ఆర్ట్స్ బ్లాక్‌లో ఆదివారం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం ఆకట్టుకుంది. శ్రీశ్రీ కళావేదిక కార్యదర్శి ధనాసి ఉషారాణి రచించిన పద్యచంద్రిక పుస్తకాన్ని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ ఇంద్ర, ఆకుల గజేంద్ర ప్రసాద్, మాజీ వీసీ కుసుమకుమారి ఆవిష్కరించారు. సుమారు 150మంది కవులు, రచయితలు పాల్గొన్న ఈ సభలో శ్రీశ్రీ కళావేదిక తరపున కత్తిమండ ప్రతాప్, కొల్లిరమాపతి, ఈశ్వరీభూషణం, హరి సర్వోత్తమనాయుడు, చిట్టె లలిత, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వీరిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్ కినగి, ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్సీ రఘువర్మ, డీఐజీ గోపినాథ్‌జెట్టి ఉన్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

## మైమరపించిన సంగీత ఝరి




తిరుపతి (కల్చరల్), జూన్ 16: వేమన విజ్ఞాన కేంద్రం ఆదివారం నిరంతర సంగీత కచేరీకి వేదికైంది. పాస్ మనోవికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం పేరుతో వారం పాటు సంగీత యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. ఈ సంగీత సభలను ఆదివారం ఉదయం ఏడు గంటలకు నిర్వాహకులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 8 గంటలకు ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కొమండూరి శేషాద్రి, విజయవాడ ఆకాశవాణి నిలయ విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, ఎస్వీ సంగీత నృత్యకళాశాల పూర్వ ప్రిన్సిపాల్, మృదంగ విద్వాంసుడు ఎం.సుధాకర్ కచేరి వీనులకు విందు చేసింది. 10 గంటల నుంచి పలువురు ప్రఖ్యాత సంగీతకారులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల శాస్త్రీయ సంగీత కచేరీలు అలరించాయి. ఈనెల 23వ తేదీవరకు రేయి, పగలూ సంగీత సభలు జరుగుతాయి. సోమవారం నిరంతర సంకీర్తన జరుగుతుందని నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు.

## మంత్రికి ఎండీయూ ఆపరేటర్ల వినతి

తిరుపతి అర్బన్, జూన్ 16: పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎండీయూ ఆపరేటర్లు తమ సమస్యలపై ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఆపరేటర్ల సంఘం ఏపీ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు తిరుపతికి చెందిన కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. కార్యదర్శి సతీష్, కోశాధికారి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ భవన్‌ను ప్రారంభించండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 16: తిరుపతి బీసీ భవన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించేలా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చొరవ తీసుకోవాలని నగర బీజేపీ నాయకుడు జల్లి మధుసూదన్ కోరారు. ఆదివారం ఆయన జానపద కళాకారుల సంఘం, బీసీఈఎఫ్ ఉద్యోగుల సంఘం నాయకులతో కలిసి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని సన్మానించారు. జానపద కళాకారుల జాతీయ అధ్యక్షుడు పలిమామిడి యాదగిరి మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## 29న తిరుపతి టౌన్ బ్యాంక్ మహాజన సభ

తిరుపతి(ఆటోనగర్), జూన్ 16: తిరుపతి టౌన్ బ్యాంక్ మహాజన సభ ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ రెడ్డి ఈవిషయం తెలిపారు. ఆదివారం జరగాల్సిన మహాజన సభను అనివార్య కారణాల వల్ల 29వ తేదీకి మార్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## నిందితుడితోపాటు సీఐపైనా కేసు నమోదుకు కోర్టు ఆదేశం

తిరుపతి(లీగల్), జూన్ 16: గతేడాది సెప్టెంబరులో జరిగిన ఉంగరం చోరీ కేసులో నిందితుడితోపాటు, అప్పటి ఈస్ట్ పోలీసు స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేయాలని రెండో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఫొటోలతో ఉన్న 36గ్రాముల బంగారు ఉంగరాన్ని టీడీపీకి చెందిన స్థానిక టీఎన్‌టీయూసీ నాయకుడు జయరామిరెడ్డి పోగొట్టుకున్నారు. దీనిపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ పట్టించుకోలేదని, నిందితున్ని పట్టుకుని వదిలేశారని జయరామిరెడ్డి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు సీఐ మహేశ్వర్‌రెడ్డిని ఏ2గా చేర్చి కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బాధితుడి తరపున న్యాయవాదులు వెంకటకుమార్, విద్యానాథ్‌రెడ్డిలు వాదనలను వినిపించారు.



## అక్రమంగా తరలిస్తున్న గరికముట్టె వేర్లు స్వాధీనం


నిందితులతో ఫారెస్టు అధికారులు

వాకాడు, జూన్ 16: మండలంలోని పంబ్రాంగం సమీపంలో గరికముట్టె వేర్లను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఫారెస్టు అధికారి శ్యాముల్ వివరాల మేరకు... శనివారం అర్ధరాత్రి గరికముట్టె వేర్లను తరలిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. దీంతో ఫారెస్టు బీట్ అధికారులతో కలసి దాడులు నిర్వహించామన్నారు. శ్రీహరికోట అడవిలో గరికముట్టె వేర్లను మూటల్లో కట్టి పంబ్రాంగం వరకు చిన్న వాహనాల్లో తరలించారన్నారు. అక్కడ ట్రాక్టర్‌లో లోడ్ చేశారన్నారు. అక్కడి నుంచి సూళ్లూరుపేట హైవేకు తరలించి మరో వాహనం ద్వారా చెన్నైకు తరలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను విచారించగా షార్‌లో దినసరి కూలీలుగా ఉన్నామని, రాత్రుల్లో గరికముట్టె వేర్లను సేకరించి చిట్టమూరు మండలానికి చెందిన దాసరి బుజ్జయ్యకు విక్రయిస్తామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న గరికముట్టె వేర్లు సుమారు 400 కిలోలు ఉన్నాయని, బహిరంగ మార్కెట్‌లో రూ.3.20 లక్షల వరకు పలకవచ్చని శామ్యూల్ తెలిపారు. ఈ వేర్లను పలు ఆయుర్వేద మందుల్లో వినియోగిస్తారన్నారు. దాడుల్లో ఫారెస్టు బీట్ అధికారులు మోహన్‌రాజ్, ప్రసన్న కుమార్, కృష్ణయ్యలతోపాటు వాకాడు ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పద్మావతి జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు - దివ్యాంగ అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీస్

## వడివడిగా.. ఉత్సాహంగా..

తిరుపతిలో ఆదివారం జరిగిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు రెండు సెషన్లలోనూ అభ్యర్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదని అధికారులు స్పష్టం చేయడంతో అభ్యర్థులందరూ ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి అభ్యర్థినీ నిశితంగా పరిశీలించాకే కేంద్రాల్లోకి అనుమతించారు.

- తిరుపతి (కలెక్టరేట్)

# గంజాయి విక్రయాలకు బ్రేక్ పడేనా?

తడ, జూన్ 16: సూళ్లూరుపేట... రాష్ట్ర సరిహద్దుల్లో చిట్టచివరి నియోజక వర్గం... ప్రశాంతంగా ఘర్షణలకు తావులేకుండా ఉన్న నియోజకవర్గం... అది ఒకప్పటి మాట. ప్రస్తుతం అరాచకం, దౌర్జన్యాలతోపాటు గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అందుకు పార్టీల నాయకులే కాకుండా పోలీసులు వత్తాసుపలకడంతో ఇక్కడ శాంతిభద్రతలు అటకెక్కాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 2014వ సంవత్సరానికి ముందు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు పెద్దగా జరిగేవికావు. ఆ తరువాత టీడీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో అప్పటి నుంచే నియోజకవర్గంలో మార్పు రావడం మొదలైంది. దాంతోపాటు గంజాయి అమ్మకాలు మొదలయ్యాయి.

**లోకల్ రైళ్లలో తరలింపు...**

అప్పట్లో తమిళనాడు రాష్ట్రంలోని ఎలాఊరు, గుమ్మిడిపూండి, కవరపేటలకు చెందిన కొందరు గంజాయిని లోకల్ రైళ్లల్లో తడ, అక్కంపేట, సూళ్లూరుపేట రైల్వే స్టేషన్లలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి జారుకునేవారు. ఈ క్రమంలో 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొందరు ఈ నియోజకవర్గంలో దుకాణాలు తెరిచేశారు. విశాఖపట్టణం, విజయనగరం వంటి ప్రాంతాల నుంచి నేరుగా గంజాయిని తీసుకువచ్చి కొన్ని ప్రాంతాల్లో డంప్ చేసుకొని విచ్చలవిడిగా విక్రయించారు.

**పోలీసుల అండదండలు...**

ఇలా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పోలీసులు చోద్యం చూశారు. కొందరికి వాటిలో వాటాలు ఉన్నట్లు గుసగుసలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సుదీర్ఘకాలం పోలీస్ అధికారిగా పనిచేసిన ఒక అధికారి ఈ గంజాయి విక్రయాలకు వెన్నుదన్నుగా నిలవడంతో మరింత జోరందుకున్నాయి. నెల మామూళ్లు, సెటిల్‌మెంట్ల కోసం కొన్ని కేసులను నమోదు చేసి చేతులను దులుపుకొని వాటి ద్వారా లక్షల రూపాయల మామూళ్లు తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి.



బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద చెన్నైకి వెళ్లే ఆర్టీసీ బస్సులో స్వాధీనం చేసుకున్న గంజాయితో సెబ్ అధికారులు(ఫైల్‌ఫొటో)

**నామమాత్రంగా కేసులు**

వాస్తవంగా 2022-23 సంవత్సరంలో తడ మండలం భీములవారిపాళెం చెక్‌పోస్టులో ఎస్ఈబీ అధికారుల తనిఖీల్లో వివిధ కేసుల ద్వారా ఆ ఏడాది సుమారు 100 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో సదరు అధికారి వాటిపై దృష్టిపెట్టి నామమాత్రంగా కొన్ని కేసులు నమోదుచేసి వారి నుంచి నెల మామూళ్లను వసూళ్లు చేసినట్లుగా విమర్శలు వినిపించాయి. ఆ తరువాత భీములవారి చెక్‌పోస్టు వద్ద ఇటు పోలీసులు అటు సెబ్ అధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. అందుకు ఆ గంజాయి విక్రయాల్లో వైసీపీకి కూడా వాటా ఉన్నట్లుగా తెలుస్తోంది. తద్వారా ఈ అమ్మకాలు జోరందుకున్నట్లుగా నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది.

**నిరుపయోగం... కార్డన్ సెర్చ్!**

ఈ క్రమంలో పోలింగ్ పూర్తి అయిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా వివిధ చోట్ల అల్లర్లు చెలరేగడంతో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సూళ్లూరుపేటలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గంజాయి విక్రయదారులకు సమాచారం అందడంతో సిబ్బంది వచ్చేలోగా తరలించేసినట్లుగా గుసగుసలు ఉన్నాయి. అయినా ఓ మహిళ ఇంట్లో సుమారు 2.5 కిలో గంజాయి గుర్తించి దానిపై నామమాత్రంగా కేసు నమోదు చేసినట్లుగా తెలుస్తోంది. ఇలా వైసీపీ వర్గాలు పోలీసుల సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వమైనా గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టి శాంతి భద్రతలను పరి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## సత్ప్రవర్తనతో మెలగండి



ప్రసంగిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట, జూన్ 16: కొత్తగా ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి అందరి మన్ననలు పొందాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం కళాశాలలో ఉన్న కోర్సులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో అత్యాధునిక వసతులతోపాటు డాక్టరేట్లు కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. కళాశాలకు అటానమస్, నాక్ గుర్తింపులున్నాయన్నారు. కమ్యూనికేషన్ రంగంలో దేశవిదేశాల్లో తమ కళాశాల నుంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు 200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?



కిందకు వేలాడుతున్న విద్యుత్ మెయిన్ లైన్లు

కోట, జూన్ 16 : మండలంలోని విద్యానగర్ హెచ్‌పీ గ్యాస్ గోడౌము వద్ద విద్యుత్ మెయిన్ తీగలు నేలకు తగులుతున్నా సంబంధిత ట్రాన్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. నెల్లూరుపల్లి కొత్తపాళెం ఫీడర్స్ నుంచి చెందోడు వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. గ్యాస్ గోడాము వద్ద ఉన్న పొలాల్లోకి వెళ్లే విద్యుత్ స్తంభం వంగి లైన్లు కిందకు వేలాడుదున్నాయి. ఈ మార్గం మీదుగా ప్రయాణించడానికి వాహనచోదకులు హడలిపోతున్నారు. గ్యాస్ గోడాము పక్కనే ఉండటం, ఈ స్తంభం ఎక్కడ విరిగిపడి పెను ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల రైతులు, వాహనచోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ఎత్తైన కొత్తస్తంభాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.

## కోటమ్మకు ఆదివారం పూజలు



కోట, జూన్ 16 : పట్టణ గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## మెరాక మందిరంలో వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న సంఘకాపరి

కోట, జూన్ 16 : పట్టణలోని మెరాక ఆరాధన మందిరంలో ఆదివారం రాత్రి 28వ వార్షిక ఉజ్జీవ కూడికలు ప్రారంభమయ్యాయి. ఈ సంబరాలను మందిరం సంఘ కాపరి ఎం.నోవాబాబు ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మృతి కూడికల గురించి బైబిల్‌లో చెప్పిన విధానాలను వివరించారు. విజయవాడకు చెందిన బ్రదర్ సుధాకర్ బాబు విచ్చేసి మెరాక ఆరాధన మందిర, బైబిల్ సూక్తులను వివరించారు.

## ఫ్లెక్సీలు తగులబెట్టిన వారిపై చర్యలు తీసుకోండి





కొత్త ఫ్లెక్సీకి జనసేన నాయకుల పూజలు

వాకాడు, జూన్ 16: డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీలకు కల్లూరులో శుక్రవారం రాత్రి నిప్పు అంటించిన గుర్తు తెలియని వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం మరో నాలుగు ఫ్లెక్సీలను తప్పెట్ల మధ్య ఊరేగించి, పాలాభిషేకం చేసి 101 టెంకాయలను కొట్టారు. అనంతరం నిప్పు పెట్టిన ఫ్లెక్సీ పక్కనే ఏర్పాటు చేశారు. అనంతరం జనసేన కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానులు వనభోజనం చేశారు. ఇకనైనా వైసీపీ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడకూడదని హితవు పలికారు. జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్, నాయకులు జనార్దన రెడ్డి, పి.మల్లికార్జున్, పి.మనోహర్, టి.సతీష్, కె.మధు తదితరులు పాల్గొన్నారు.

## జీవో 117ను రద్దు చేయించండి

### ఎమ్మెల్యే విజయశ్రీకి ఏపీటీఎఫ్ నాయకుల వినతి



ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నాయుడుపేట, జూన్ 16: మూడు, నాలుగు, ఐదో తరగతును హైస్కూల్‌లో విలీనం చేస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 117ను రద్దు చేయించాలని ఏపీటీఎఫ్ నాయకులు నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం పథకం అమలు చేయడం ద్వారా ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్-2 ద్వారా ప్రత్యేక ప్రయోజనం చేకూరకపోగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆదరణ కరువవుతుందన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే విజయశ్రీని, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలను ఏపీటీఎఫ్ నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

## 'నీట్... అడుగడుగునా అవినీతిమయం'

నాయుడుపేట, జూన్ 16: దేశంలో వైద్యరంగ ప్రవేశానికి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ అడుగడుగునా అవినీతిమయమవుతోందని ఉమ్మడి జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ ఉపాధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల అధ్యక్షుడు మహేష్ అన్నారు. 2016 పూర్వం ఎంసెట్ ద్వారా ఎంబీబీఎస్ ప్రవేశాలు ఉండేవని, అప్పుడు ఆయా రాష్ట్రాల విద్యాప్రమాణాల ప్రకారం ప్రవేశ పరీక్ష జరుగుతుండటంతో ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. దక్షిణ భారతదేశంలో ఇప్పటికీ ఉన్నత పాఠశాలల్లో, ఇంటర్మీడియెట్‌లో సీబీఎస్ఈ సిలబస్ లేదని కేవలం ఉత్తరభారతంలో మాత్రమే ఆ సిలబస్ ఉండటంతో దేశవ్యాప్తంగా నీట్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 2024 మే 5న నీట్ ఉండగా, మే 4న నీట్ పరీక్షాపత్రం లీక్‌అయినట్లు పట్నాలో దాదాపు 14 మందిపై కేసు నమోదైందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 67 మందికి జాతీయ స్థాయిలో 720మార్కులకు 720 రావడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షాపత్రాలు ముందస్తుగా రూ.30 లక్షలకు కొనుగోలు చేసినట్లు కేసులు నమోదయ్యాయన్నారు. ఒక్కప్రశ్నకు 4 మార్కులు, తప్పుకు ఒక్కమార్కు తీసివేయాల్సి ఉండగా, ఫస్ట్‌ర్యాంక్ 720 మార్కులు అయితే తరువాత 716 లేక 715 మార్కులు రావాల్సి ఉండగా 719, 718 మార్కులు వెల్లడించడంపట్ల ఎంతటి అవినీతి నెలకొందో తేటతెల్లమవుతోందన్నారు. గ్రేస్ మార్కులు కలపడంతోనే ర్యాంకులు వచ్చాయని నీట్ నిర్వహించిన నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌డీఏ) వివరణ చాలా బాధ్యతారహితంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వం నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కోరారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 16: స్థానిక ఏరియా ఆసుపత్రిలోని ప్రసూతి కేంద్రంలో ఆదివారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. ఎస్ఎల్ఎన్‌స్వామి, జగదీష్, మురళీనాయుడు, రాధకృష్ణారెడ్డి, గోపీనాథ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న గరికముట్టె వేర్లు స్వాధీనం



నిందితులతో ఫారెస్టు అధికారులు

వాకాడు, జూన్ 16: మండలంలోని పంబ్రాంగం సమీపంలో గరికముట్టె వేర్లను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఫారెస్టు అధికారి శ్యాముల్ వివరాల మేరకు... శనివారం అర్ధరాత్రి గరికముట్టె వేర్లను తరలిస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. దీంతో ఫారెస్టు బీట్ అధికారులతో కలసి దాడులు నిర్వహించామన్నారు. శ్రీహరికోట అడవిలో గరికముట్టె వేర్లను మూటల్లో కట్టి పంబ్రాంగం వరకు చిన్న వాహనాల్లో తరలించారన్నారు. అక్కడ ట్రాక్టర్‌లో లోడ్ చేశారన్నారు. అక్కడి నుంచి సూళ్లూరుపేట హైవేకు తరలించి మరో వాహనం ద్వారా చెన్నైకు తరలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను విచారించగా షార్‌లో దినసరి కూలీలుగా ఉన్నామని, రాత్రుల్లో గరికముట్టె వేర్లను సేకరించి చిట్టమూరు మండలానికి చెందిన దాసరి బుజ్జయ్యకు విక్రయిస్తామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న గరికముట్టె వేర్లు సుమారు 400 కిలోలు ఉన్నాయని, బహిరంగ మార్కెట్‌లో రూ.3.20 లక్షల వరకు పలకవచ్చని శామ్యూల్ తెలిపారు. ఈ వేర్లను పలు ఆయుర్వేద మందుల్లో వినియోగిస్తారన్నారు. దాడుల్లో ఫారెస్టు బీట్ అధికారులు మోహన్‌రాజ్, ప్రసన్న కుమార్, కృష్ణయ్యలతోపాటు వాకాడు ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో ఉరుములు, మెరుపులతో వర్షం



జీఎన్‌టీరోడ్డులో, గాండ్లవీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన నీరు

సూళ్లూరుపేట, జూన్ 16: పట్టణంలోని ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం భానుడు భగభగమన్నాడు. మధ్నాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జీఎన్‌ఈటీ రోడ్డు, షార్ బస్టాండు, గాండ్లవీధి జలమయంగా మారాయి. గంటపాటు కురిసిన భారీ వర్షానికి జీఎన్‌టీ రోడ్డులో నీరు నిలబడడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బంది పడ్డారు. గాండ్ల వీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మోకాటి లోతు నీరు నిలబడడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి. కూరగాయల మార్కెట్ సెంటర్ రోడ్డులో నీరు నిలబడడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వర్షపు నీటితో పాటూ మురుగు పొంగి ప్రవహించింది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన పట్టణవాసులు ఈ వర్షంతో సేద దీరారు.

## భక్తులతో కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం





సూళ్లూరుపేట, జూన్ 16: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం తెలుగు, తమిళ భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌లో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.


## టీడీపీ నాయకుడు చిరంజీవిరెడ్డి మృతి

### నివాళి అర్పించిన నెలవల, పార్టీ నేతలు

ఓజిలి, జూన్ 16: మండలంలోని అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కె.చిరంజీవిరెడ్డి (55) ఆదివారం మృతి చెందారు. ఇటీవల ఇంట్లో బాత్‌రూంలో జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. భౌతికకాయాన్ని స్వగ్రామం అత్తివరంకు తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం గ్రామానికి వెళ్లి చిరంజీవిరెడ్డికి నివాళి అర్పించి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కాగా కుందాం సొసైటీ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి సోదరుడే చిరంజీవి రెడ్డి. నాయుడుపేట ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వి.మురళీకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కరెడ్డి, నాగేంద్ర రెడ్డి, చైతన్యరెడ్డి, జనార్దన రెడ్డి, విజయకుమార్‌నాయుడు, సత్యవర ప్రసాద్‌రావు తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోండి

### ముస్లిం మతపెద్దలకు డీఎస్పీ పిలుపు



మతపెద్దలకు సూచనలిస్తున్న డీఎస్పీ

నాయుడుపేట టౌన్, జూన్ 16: ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస రెడ్డి సూచించారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించబోవు బక్రీద్ పండగను ముస్లిం సోదరులు ఐక్యతతో జరుపుకోవాలని సూచించారు. అలాగే గోవధ నిషేధం అములులో ఉందని వారికి అవగాహన కల్పించారు. ప్రతి మసీదు వద్ద బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## అడ్డుకుని బెదిరించారని కేసు నమోదు

గూడూరు అర్బన్, జూన్ 16: నివేశ స్థలానికి మట్టి తోలుకుంటుండగా ఐదుగురు చిన్న పత్రికల విలేకరులు అడ్డుకుని బెదిరించారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో వారిపై శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. గూడూరు మండలంలోని రామలింగాపురానికి చెందిన కిరణ్ చెన్నూరులోని అతని స్థలంలో మట్టిని నింపుకునేందుకు రామలింగాపురంలోని పట్టా పొలం నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో గూడూరుకు చెందిన వివిధ పత్రికల్లో పనిచేస్తున్న ఐదుగురు విలేకరులు రామలింగాపురం సమీపంలో ట్రాక్టర్లను అడ్డుకుని అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తామని, నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. దీంతో బాధితుడు భయాందోళనకు గురై వారికి రూ.8వేలు ఇచ్చారన్నారు. అనంతరం కిరణ్ ఈ విషయమై ఫిర్యాదు చేయగా ఐదుగురు విలేకరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, జూన్ 16: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయలం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మంత్రి ఆనంకు అభినందనలు

గూడూరు, జూన్ 16: దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో గూడూరుకు చెందిన టీడీపీ నాయకుడు అమరయ్యనాయుడు కలిసి అభినందనలు తెలిపారు. మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టడంతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పినట్లు తెలిపారు.

## దివ్యాంగులకు జేవీవీ చేయూత



గూడూరు, జూన్ 16: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దశరథరామిరెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ పట్టణాధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో మూఢనమ్మకాలను పారదోలేందుకు, సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు జేవీవీ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వీటితో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం లో మోహన్, పురుషోత్తం, రామ్మోహన్, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా చేతి పంపులు



మిట్టపాళెంలో హెడ్ లేని బోరు

గూడూరు, జూన్ 16: పట్టణ పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజల అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోర్లు 40శాతానికి పైగా మరమ్మతులకు గురి అయ్యాయి. వేసవి కావడంతో నీటి అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 460కు పైగా బోర్లున్నాయి. వాటి ఆలనాపాలనా పట్టించుకోకపోవడంతో సుమారు 200 వరకు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ బోర్ల నుంచి సవ్యగా నీరు వస్తున్నప్పటికీ వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా లేని సమయంలో ప్రజలు వినియోగించుకుంటున్నారు. మరమ్మతులకు గురైన బోర్లను మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన బోర్లును వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దర్గావీధిలో మరమ్మతులకు గురైన బోరు

## హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 16: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కాగానే నేరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం తన నివాసంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తొలిసంతకం మెగా డీఎస్సీపై పెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సీఎం చర్యలు తీసుకున్నారన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్‌ను రూ.4వేల పెంచడం, అన్నక్యాంటీన్లను పునరుద్ధరించడం, స్కిల్‌సెన్సస్‌పై సంతకాలు చేయడం చారిత్రకమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గూడూరు టీడీపీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, నెం.8790313233కు ప్రజలు తమ సమస్యలను తెలియ జేయవచ్చన్నారు. ప్రధానంగా పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయం వద్ద తన సొంత నిధులతో బోర్లను తవ్వించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిన ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయిస్తానన్నారు. వైసీపీ నాయకులపై ఎటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడమని, అవినీతికి పాల్పడిన వారిని విడిచిపెట్టేది లేదన్నారు.ఎస్.కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఆనంను కలిసిన కురుగొండ్ల



మంత్రి ఆనంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 16: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ ఆదివారం నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అదేవిధంగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదివారం కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

## కొమ్మినేనిపల్లిలో టీడీపీ సంబరాలు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సూళ్లూరుపేట, జూన్ 16: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతోపాటు విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆదివారం మండల పరిధిలోని కొమ్మినేనిపల్లిలో టీడీపీ మండల కార్యదర్శి పాకం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ... చంద్రబాబు సీఎం అయినే వెంటనే ఐదు పథకాలకు సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇకపై రాష్ట్రంలో సుభిక్షంగా పాలన జరుగుతుందన్నారు.

## కంటి వైద్య శిబిరం



నాయుడుపేట టౌన్, జూన్ 16: పట్టణంలోని చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి వైద్య ఉచిత శిబిరం జరిగింది. పట్టణంలోని రాజగోపాలపురం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే మందులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో సీతారామనాయుడు, ఏవో కృష్ణ, అరవింద నేత్రాలయ సిబ్బంది శంకర్, తదితరులు ఉన్నారు.

## అభివృద్ధికి చిహ్నం... చంద్రబాబు

### ● ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట టౌన్, జూన్ 16: అభివృద్ధికి చిహ్నం... చంద్రబాబు అని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... టీడీపీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన సమయంలో రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్‌లో కూడా చంద్ర బాబు ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించారన్నారు. ఆ నమ్మకంతోనే ప్రజలు చంద్రబాబుకు మళ్లీ పట్టం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలచందర్, రఫి, వెంకటస్వామి, వెంకటయ్య, నాగరాజు, సురేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

## ముస్లింలకు అండగా ఉంటా: సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడిని సన్మానిస్తున్న ముస్లింలు

శ్రీకాళహస్తి, జూన్ 16: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముస్లింలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఊరందూరులోని ఆయన స్వగృహం వద్ద శ్రీకాళహస్తికి చెందిన ముస్లింలు సుధీర్‌రెడ్డి సన్మానించారు. బక్రీద్‌కు ఈద్గాల వద్దకు రావాలని ఆహ్వానించారు. ముస్లింలు సమస్యలను సుధీర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంగా షామియానా ఖర్చులు ఇచ్చేవారన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ముస్లింలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ షాదీ మహల్స్ మరమ్మతులు, ఈద్గాల వద్ద సుందరీకరణ వంటి ఏ సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈద్గాలకు సంబంధించి షామియానా ఖర్చులు ఇస్తామన్నారు. బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద శుభ్రం చేయడం, నీటి వసతి వంటి ఏర్పాట్లు చేయాలని పురపాలక సంఘ అధికారులను ఆదేశించారు. ముస్లింలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ అక్రమ్, ప్రభుత్వ కాజీ షరీఫ్, అంజాద్‌బాషా, నూరుల్లా, ఖలీల్‌సాహెబ్, ఉమర్, హమీద్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ షఫీ, ఖలీల్, అస్మత్, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సన్మానం

రేణిగుంట, జూన్ 16: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని రేణిగుంటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు సన్మానించారు. టీడీపీ సీనియర్ నేత జీకే మునీర్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఊరందూరులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హాజీ రహీం, అఫ్రోజ్, నవాబ్, సమి, జిలానీ, కరీముల్లా, ఇమ్రోజ్, మహబూబ్‌బాషా, సలీం, మహబూబ్ బాషా, నాగేశ్వరరావు, అంబి, గౌతమ్, గిరి, పుష్పనాథన్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో శివశంకర్(28) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివశంకర్ ఏర్పేడు మండలంలోని పాగాలి వద్ద ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడుగా పనిచేస్తుంటాడు. శ్రీకాళహస్తి మండలంలోని విశాలాక్షినగర్ కాలనీ వద్ద అద్దె గదిలో నివాసం ఉంటాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఆటోలో విశాలాక్షినగర్ కాలనీ వద్ద దిగాడు. ఇక్కడ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ శివశంకర్‌ను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స మెరుగైన వైద్యం కోసం అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

### పారిశుధ్య పనుల పేరిట అవినీతి

రేణిగుంట, జూన్ 16: మండలంలోని తూకివాకం పంచాయతీలో పారిశుధ్య పనుల పేరిట మంజూరు చేసిన బిల్లుల్లో అవినీతి జరిగిందని ఉప సర్పంచు శ్రీనివాసులు ఆరోపించారు. టీడీపీ నేతలు నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి, వార్డు మెంబరు ధనమ్మతో కలిసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. శుక్రవారం పంచాయతీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి వార్డు మెంబర్లకు అజెండా ఇవ్వడం జరిగిందన్నారు. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా విమానాశ్రయం నుంచి తిరుపతికి వెళ్లే దారిలో పారిశుధ్య పనులకు రూ.1.70 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పడం అనుమానం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పంచాయతీలో పారిశుధ్య పనులకు రూ.5 వేలకు మించి ఖర్చు చేయకూడదన్నారు. 30మంది పంచాయతీ వర్కర్లతో కేవలం రోడ్లను ఊడిపించి, రూ.లక్షల్లో బిల్లులు ఓచర్లు లేకుండా అజెండాలో చేర్చడం పట్ల అభ్యంతరం తెలిపామన్నారు.

### ప్లేస్‌మెంట్‌పై అవగాహన

ఏర్పేడు, జూన్ 16: 2024 జేఈఈ అడ్వాన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌పై ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేఈఈ అడ్వాన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థుల కోసం తిరుపతి ఐఐటీ ఆదివారం ఓపెన్ హౌస్ నిర్వహించింది. ఇందులో సుమారు 60మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అకడమిక్స్, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ ప్లేస్‌మెంట్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐటీ పీఆర్వో చమన్ మెహతా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన ఎన్ఎంయూఏ నాయకులు



ఆదిమూలాన్ని సన్మానిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

సత్యవేడు, జూన్ 16: సత్యవేడు ఆర్టీసీ డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే ఆదిమూలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శాలువ, పూలమాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షుడు పరమశివం, అసోసియేషన్ నాయకులు సురేష్, కేఆర్ కృష్ణ, వెంకటేశులు, ప్రకాష్, గోపాల్, మునిరామయ్య, మూర్తి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

### ఆదిమూలానికి సన్మానం

వరదయ్యపాలెం, జూన్ 16: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరుకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని సన్మానించారు. దశరథయ్య, అంకయ్య, శివయ్య, రవి, యుగంధర్‌రెడ్డి, నిర్మల్, కరుణాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లారీ, ద్విచక్ర వాహనం ఢీ

### జడ్చర్ల యువకుడి మృతి

### ఇద్దరికి తీవ్ర గాయాలు

రేణిగుంట, జూన్ 16: ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్న ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామండూరు వద్ద ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం జడ్చర్లకు చెందిన యాదగిరి, మహేష్, అరుణ్‌కుమార్ జీవకోన సమీపంలో రెడ్డిభవనం వద్ద ఒప్పంద కార్మికులుగా పని చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ముగ్గురూ ఒకే ద్విచక్ర వాహనంలో మామండూరు అటవీ ప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యాదగిరి(32) అక్కడికక్కడే మృతి చెందగా, మహేష్, అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఆరోగ్యనాథన్ మృతి

రేణిగుంట, జూన్ 16: రేణిగుంట అన్నాయినగర్‌కు చెందిన చెందిని జాతీయ జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఆరోగ్యనాథన్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచు జ్యోతి నారాయణ, కార్యకర్తలు అమర్‌నాథ్‌రెడ్డి, విద్యాసాగర్ నివాళులర్పించారు.

### వైభవంగా మండల పూజలు

సత్యవేడు, జూన్ 16: మండలంలోని ఇరుగుళంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వస్వామి ఆలయంలో మండల ముగింపు పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుశీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రుత్వికుల బృందం 108 శంకువులతో కలశపూజ, హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మహాదీపారాధన నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

### కీళపూడిలో జాతర ప్రారంభం

పిచ్చాటూరు, జూన్ 16: పిచ్చాటూరు సమీపంలోని కీళపూడి గ్రామంలో గంగమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గ్రామదేవతలకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి గెరిగెను ఊరేగించారు. జాతర సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ, అమ్మవారి భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు.

### ఈసీఐ చర్చిలో అన్నదానం

పిచ్చాటూరు, జూన్ 16: పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన సి.రుకేష్ స్థానిక ఈసీఐ చర్చిలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కోనేటి ఆదిమూలం విజయం సాధించడంతో మొక్కు చెల్లించేందుకు అన్నాదానం చేసినట్లు తెలిపారు.

### టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచు



రత్నమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూన్ 16: మండలంలోని అరణ్యం కండ్రిగ పంచాయతీ సర్పంచు రత్నమ్మ, జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆమెకు ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మంత్రికి సన్మానం

శ్రీకాళహస్తి, జూన్ 16: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనను బీజేపీ తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

### వంతెనలు నిర్మించండి

కేవీబీపురం, జూన్ 15: మండలంలోని పూడి, అంజూరు నుంచి జయలక్ష్మీపురానికి వెళ్లే మార్గంలో కాళంగి నదిపై వంతెనలు నిర్మించాలని తిరుపతి పార్లమెంటు టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, సత్యవేడు నియోజకవర్గ తెలుగు యువత ఇన్‌ఛార్జి లక్ష్మీపతిరాజు, జూడో డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి తదితరులు ఎమ్మెల్యే ఆదిమూలానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. సమస్యలను వివరించారు. కొత్తూరులో సీసీరోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేశవులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆరునెలల్లో కాసాగార్డెన్ వసతి గృహం అభివృద్ధి

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాసాగార్డెన్ వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 16: కాసాగార్డెన్ వసతిగృహాన్ని ఆరునెలల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని కాసాగార్డెన్ బాలికల గురుకుల వసతి గృహం, ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ముందుగా కాసాగార్డెన్ వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇరుకు గదుల్లో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడటాన్ని గుర్తించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నాడు-నేడు పేరుతో మాజీ ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి తీవ్ర అవినీతికి పాల్పడ్డారన్నారు. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా అధ్వాన స్థితికి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఇరుకు గదిని 28మంది బాలికలకు కేటాయించడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే మధు శ్రీకాళహస్తిలో పరిశ్రమల నిర్వాహకులను బెదిరించారని ఆరోపించారు. ప్రస్తుతం వైసీపీ పీడ విరగడవడంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ పథకం కింద సేవ చేసేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారన్నారు. గ్రీన్ ప్యానెల్ పరిశ్రమ నిర్వాహకులు కాసాగార్డెన్ వసతి గృహాన్ని ఆరునెలల్లో ఒక మోడల్ హాస్టల్‌గా తీర్చిదిద్దేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇక శ్రీకాళహస్తిలో వీధి దీపాలు, ఇతర పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. శనివారం ఒకరోజే 15శాతం పనులు పూర్తి చేశారన్నారు. ప్రతి సమస్యనూ ఖచ్చితమైన సమయాన్ని నిర్దేశించుకుని పరిష్కారం వైపు అడుగులు వేస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు అధ్వానంగా ఉండటంతో అధికారులను నిలదీశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదంటూ హెచ్చరించారు. వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు చెప్పారు. పక్కనే అయ్యలనాడు చెరువులో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తోందని, హాస్టల్‌లోకి పాములు, పందులు, కుక్కలు చొరబడుతున్నాయని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, విజయకుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడితో పాటు సీఐపైనా కేసు నమోదుకు కోర్టు ఆదేశం

తిరుపతి(లీగల్), జూన్ 16: గతేడాది సెప్టెంబరులో జరిగిన ఉంగరం చోరీ కేసులో నిందితుడితో పాటు, అప్పటి ఈస్ట్ పోలీసు స్టేషన్ సీఐ మహేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ 2వ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్ కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఫోటోలతో ఉన్న 36గ్రాముల బంగారు ఉంగరాన్ని టీడీపీకి చెందిన స్థానిక టీఎన్‌టీయూసీ నాయకుడు జయరామిరెడ్డి పోగొట్టుకున్నారు. దీనిపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ పట్టించుకోలేదని, నిందితున్ని పట్టుకుని వదిలేశారని జయరామిరెడ్డి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు కేసు నమోదు చేయని సీఐ మహేశ్వర్‌రెడ్డిని ఏ2గా చేర్చాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బాధితుడి తరపున న్యాయవాదులు వెంకటకుమార్, విద్యానాథ్‌రెడ్డి వాదనలను వినిపించారు.

### సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పవన్



సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ

తిరుపతి అర్బన్, జూన్ 16: రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వంకీపురం పవన్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మణికంఠ, ప్రధాన కార్యదర్శిగా మురళీమోహన్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా ధరణికుమార్, కోశాధికారులుగా హేమంత్, గుంటూరు రేఖ, రాష్ట్ర కౌన్సిలర్లు చీర్ల కిరణ్, భరత్‌కుమార్, గంటా భరత్, సుబ్బారాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్, వైస్‌ప్రెసిడెంట్స్‌గా మంజునాథ్, చలపతి, సునీల్‌కుమార్ యాదవ్, రంగయ్య, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, శ్రీహరి, ఈశ్వర్‌నాయక్ నియమితులయ్యారు.

### ముక్కంటి ఆలయానికి ప్రచార వాహనం



ప్రచార వాహనానికి పూజలు చేస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, జూన్ 15: ముక్కంటి ఆలయానికి వరుణ్ ట్రక్స్ ఏజెన్సీ రాయితీపై ప్రచార వాహనాన్ని అందజేసింది. ఆదివారం ఈవో నాగేశ్వరరావును కలిసి వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి మహత్యాన్ని రాష్ట్ర నలుమూలలకు ప్రచారం చేసేందుకు రూ.36లక్షల విలువ చేసే భారత్ బెంజ్ వాహనాన్ని వరుణ్ ట్రక్స్ షోరూమ్‌లో కొనుగోలు చేయగా సుమారు రూ.10లక్షలు రాయితీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జున ప్రసాద్, సతీష్‌మాలిక్, ఆలయ సిబ్బంది, షోరూం నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఆవుల తరలింపునకు అడ్డుకట్ట

శ్రీకాళహస్తి, జూన్ 16: అనుమానాస్పదంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ వద్ద మినీలారీలో ఏడు ఆవులను తరలిస్తున్నట్లుగా టూటౌన్ పోలీసులు గుర్తించారు. ఆవులను ఎక్కడ కొనుగోలు చేశారు.. ఎందుకు తరలిస్తున్నారనే విషయాన్ని వాహన డ్రైవర్ వెల్లడించకుండా దాటవేశాడు. దీంతో వాహనంతో సహా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

### ఎమ్మెల్యేకు గుడిమల్లం ఆలయ అర్చకుల ఆశీర్వచనం

ఏర్పేడు, జూన్ 16: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆదివారం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, అర్చకులు వంశీకృష్ణ శర్మ ఊరందూరులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. వేదాశీర్వచనం చేశారు. అలాగే ఎమ్మెల్యే తల్లి బొజ్జల బృందమ్మకు ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

శ్రీకాళహస్తి, జూన్ 16: శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్ వద్ద అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం అధికార యంత్రాంగం ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆదివారం కూడా ఈ పనులు జోరుగా సాగాయి. పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న కాలువ పోరంబోకు భూములకు అధికారులు విముక్తి కల్పిస్తున్నారు. అలాగే కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే పనులు కొనసాగనున్నాయి.

### భూఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి

శ్రీకాళహస్తి, జూన్ 16: పట్టణంలోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో భూఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో వంద కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు అధికార బలంతో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణేష్, శివ, షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు అన్యాయం చేయొద్దు

శ్రీకాళహస్తి, జూన్ 16: రాజీవ్‌నగర్ కాలనీలో ఆక్రమణల తొలగింపు సందర్భంగా పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు విజ్ఞప్తి చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలో పనసకాల్వ పోరంబోకు, రోడ్డు పోరంబోకులో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శనివారం నుంచి అధికారులు తొలగించే పనులు ప్రారంభించారు. ఆదివారం ఆ ప్రదేశాన్ని బత్తెయ్య నాయుడు కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది పేదలు స్థలాలు కొనుగోలు చేసి మోసపోయారన్నారు.

### బక్రీద్ శుభాకాంక్షలు: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 16: జిల్లాలోని ముస్లింలందరూ మతసామరస్యంగా సంతోషంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని కోరుతూ వారికి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచల కిషోర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పండుగను సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### బక్రీద్‌ను ఆనందంగా జరుపుకోవాలి

శ్రీకాళహస్తి, జూన్ 16: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదివారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### త్యాగానికి ప్రతీక బక్రీద్

పిచ్చాటూరు, జూన్ 16: త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.



# పుత్తూరు వార్తలు



భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

## ఎమ్మెల్యే భానుకు వేదపండితుల ఆశీర్వాదం

పుత్తూరు అర్బన్, జూన్ 16: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను తిరుమల వేదపండితులు ఆశీర్వదించారు. ఆదివారం తిరుమల నుంచి వచ్చిన వేదపండితులు తిరుపతిలోని ఎమ్మెల్యే స్వగృహంలో మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు, శ్రీవారి శేషవస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదం అందజేశారు. అలాగే పుత్తూరుకు చెందిన యాదవ సంఘం నాయకులు, ఉద్యోగులు, మహిళలు, గేటు పుత్తూరుకు చెందిన ముస్లింలు ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. భానుప్రకాష్ మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మజీద్ బాషా, మహమద్ గౌస్, జమాల్ ఆలీషా, సలీం, ఎస్‌కే. షబ్బర్, కే.నందాని, హమీద్‌బాషా, యాదవ సంఘం నాయకులు ఈశ్వరయాదవ్, వెంకటముని మేస్త్రి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



మేదినీ పూజ అనంతరం పుట్టమట్టిని సేకరిస్తున్న అర్చకులు



విద్యుత్‌దీపాలంకరణలో ఆలయం

వడమాలపేట, జూన్ 16: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. మాడవీధుల్లో మేళతాళాలతో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. పుట్టమట్టిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టని మేదినీ దేవి రూపంలో అలంకరింపజేసి, మంగళహారుతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ధ్వజారోహణం

అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు సోమవారం మిథున లగ్నంలో ఉదయం 6.55 - 7.25 గంటల మధ్య ధ్వజారోహణం చేయనున్నారు.

### ముస్తాబైన అప్పలాయగుంట

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అప్పలాయగుంట సుందరంగా ముస్తాబైంది. ఈనెల 17నుంచి 25వ తేదీ వరకు ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ప్రత్యేక విద్యుత్‌దీపాలు, దేవతామూర్తులు కటౌట్‌లతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. మాడవీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.